
పెద్దశంకరంపేటలో కారును తనిఖీ చేస్తున్న అల్లాదుర్గం సీఐ జార్జి (ఫైల్)



చిలిపిచెడ్‌లో ఓ కిరాణం షాపులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

# నిఘా.. తనిఖీ.. కవాతు

- పకడ్బందీగా అధికారుల నిఘా, తనిఖీలు
- పట్టుబడుతున్న నగదు, మద్యం
- మెదక్ జిల్లా పరిధిలోని ఏడు చెక్‌పోస్టుల్లో నిరంతర పర్యవేక్షణ
- ఇప్పటికే రూ.1821.345 లీటర్ల మద్యం
- రూ.1.69 కోట్ల నగదు పట్టివేత

మెదక్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లాలో తనఖీలు కొనసాగుతున్నాయి. గత ఎన్నికల్లో జిల్లాలో నగదు పంపిణీతో పాటు మద్యం ఏరులైపారింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం నిర్వహిస్తున్న అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీ జరగకుండా ఎన్నికల కమిషన్ సూచనలతో అధికార యంత్రాంగం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. రాజకీయ పార్టీలు నగదు, మద్యం పంపిణీని అడ్డుకునేందుకు సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి రోజూ వాహనాల్లో తనిఖీలు చేపడుతున్నారు.


ఎస్పీ రోహిణిప్రియదర్శిని

**- రూ.1.69 కోట్ల నగదు పట్టివేత...**

జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. రూ. 50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని ఎన్నికల కమిషన్ నిబంధన. కొందరు తెలిసి, మరి కొందరు తెలియక అంతకు మించి నగదు తీసుకెళ్తూ చెక్ పోస్టుల వద్ద తనిఖీల్లో పోలీసులకు దొరికిపోతున్నారు. మెదక్ జిల్లాలో ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. నిజాంపేట, రామాయంపేట, అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొడ్మట్‌పల్లి సరిహద్దులో, నర్సాపూర్ ఎక్స్ రోడ్ వద్ద, పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధి జమ్మికుంట వద్ద, మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి కాళ్లకల్ వద్ద, హవేళీఘనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పోచమ్మరాల్ వద్ద జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద ఇప్పటి వర కు రూ. 1,69,37,558 నగదును పోలీసులు స్వాధీనం చేసుకొని ఎన్నికల అధికారులకు అప్పగించారు. 1821.345 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ. 9,55,794 ఉంటుంది.

**కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్...**

జిల్లాలో ఎన్నికలను ప్రశాంతం గా నిర్వహించడానికి సమస్యాత్మక ప్రాంతాల ఓటర్లలో భయాం దోళనలను తొలిగించడానికి ఎస్ఎఫ్ కేంద్ర బలగాల సేవలను వినియోగించుకోనున్నారు. ఓటర్లకు భరోసా కల్పించడా నికి జిల్లాకేంద్రంలో ఇందిరా గాంధీ స్టేడియం ధ్యాన్‌చంద్ చౌరస్తా వద్ద పారా మిలటరీ దళాల ఫ్లాగ్ మార్చ్‌ను ఎస్పీ రోహిణిప్రియదర్శిని ప్రారంభించారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ, గాంధీనగర్, సుభాష్‌నగర్, పెద్ద బజార్, మజీద్, నవాబ్‌పేట్, ఓల్డ్ బస్టాండ్, శాంతినగర్, నర్సిఖేడ్ వీధుల్లో, నర్సాపూర్‌లో కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది భారీ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. జిల్లాకు చెందిన పోలీసులతో కలిసి కేంద్ర బలగాలు చెక్‌పోస్టుల వద్ద నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తారు.

**తనిఖీలకు కేంద్రబలగాలు : ఎస్పీ రోహిణిప్రియదర్శిని**

జిల్లాలో నగదు, మద్యం తరలింపు అడ్డుకునేందుకు చెక్‌పోస్టుల వద్ద, నిరంతరం వాహనాల తనిఖీలు చేస్తున్నాం. మెదక్ జిల్లాకు రెండు ఎస్ఎస్‌పీ కంపెనీలు వచ్చాయి. వీటిని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు కేటాయించాం. కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ఓటర్లకు భరోసా కల్పిస్తున్నం. నామినేషన్ వరకు కేంద్ర బలగాలు ఉంటాయి.


నర్సాపూర్ పట్టణంలో కవాత్తు చేస్తున్న కేంద్ర బలగాలు (ఫైల్)

## 29న సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక

సంగారెడ్డి అర్బన్, అక్టోబర్ 26 : మెదక్ ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల ఖోఖో జట్టు ఎంపికను ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తి ఉన్న క్రీడాకారులు జిల్లాకేంద్రంలోని స్థానిక అంబేద్కర్ స్టేడియానికి ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. 14 ఏండ్ల వయస్సున్న బాలబాలికలు పోటీలకు అర్హులని, వయసు, ఎత్తు, బరువు మెత్తం 215 పాయింట్లకు మించొద్దన్నారు. పోటీల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులు మెదక్ ఉమ్మడి జిల్లా తరపున నవంబర్ 14వ తేదీన తుప్రాన్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. అసక్తి ఉన్న క్రీడాకారులు పూర్తి సమాచారం కోసం ఫోన్ నంబర్లు 9705465737 (మధు), 8142199032 (నాగగౌడ్) సంప్రదించాలన్నారు.

## నర్సాపూర్‌లో గంజాయి పట్టివేత


నిందితుడిని చూపిస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరేందర్

నర్సాపూర్, అక్టోబర్ 26 : నర్సాపూర్ పట్టణంలోని బీవీఆర్ఐటీ కళాశాల వద్ద రాంచంద్రాపురం చౌరస్తాలో గురువారం రూట్ వాచ్ నిర్వహించి, 1.05 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తి బైక్‌పై ఎండు గంజాయిని తరలిస్తున్నాడనే సమాచారంతో పట్టుకున్నట్లు వెల్లడించారు. అతడి నుంచి 1.05 కేజీల ఎండు గంజాయి, మొబైల్, బైక్, రూ. 16500 నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేసి నర్సాపూర్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది ఎల్లయ్య, చంద్రయ్య, కానిస్టేబుళ్లు రవి, నవీన్, నరేశ్, హరీశ్ పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి

- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం

సంగారెడ్డి, అక్టోబర్ 26 : ప్రమాదాల్లో గాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న బాధితులకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ పిలుపునిచ్చారు. రక్తాన్ని దానం చేసివారిని ప్రాణదాతలుగా గుర్తిస్తారని పేర్కొన్నారు. గురువారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేశ్ స్వయంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. రక్తాదాన శిబిరంలో ఎస్పీతోపాటు ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, సుధీర్‌కుమార్, చంద్రయ్య, ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, రామరావు, హన్మిరెడ్డి, పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. ఈ శిబిరంలో సుమారు 38 యూనిట్ల రక్తం చేకరించారు. రక్తదానం చేసిన అధికారులు, సిబ్బంది, సంగారెడ్డి పట్టణ యువతకు రెడ్‌క్రాస్ సంస్థ తరపున ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేశ్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, మీరు చేసే రక్తదానం ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను రక్షించడానికి ఉపయోగపడుతుందన్నారు. కుల, మత భేదం లేని దానం కేవలం రక్త దానమే అన్నారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలుగా నిలబడాలని ఎస్పీ కోరారు. రక్తదాన శిబిరంలో అదనపు ఎస్పీ అశోక్, సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, ఆర్ఎంవో ఆంజనేయులు, మెడికల్ అధికారి శ్రీలేఖ, పోలీసు మెడికల్ అధికారి జ్యోతి, డీఎస్పీ రమేశ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ జనార్దన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శివలింగం, ఉమెన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్‌బీ ఎస్సై యాదవరెడ్డి, పోలీస్ సంఘం అధ్యక్షుడు గుర్గారెడ్డి, ప్రభుత్వ దవాఖాన బ్లడ్ బ్యాంకు సిబ్బంది రాజు, మోహన్, వాణి, పూలమ్మ, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి చందర్, స్రవంతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేసిన ఎస్పీ చెన్నూరి రూపేశ్


నర్సాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి

# నర్సాపూర్ బీజేపీలో ముసలం

- మురళీయాదవ్‌కు టికెట్ ఇవ్వడం తగదు
- పోటీగా బీసీ అభ్యర్థితో పోటీ చేయిస్తాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, రాష్ట నాయకులు మల్లేశ్‌గౌడ్, రఘువీర్‌రెడ్డి

నర్సాపూర్, అక్టోబర్ 26 : నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిని మార్చకపోతే బీసీ అభ్యర్థిని రెబల్‌గా నిలబెడతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపలి గోపి బీజేపీ అధిష్టానాన్ని హెచ్చరించారు. గురువారం నర్సాపూర్ పట్టణంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపి, రాష్ట్ర నాయకులు మల్లేశ్‌గౌడ్, రఘువీర్‌రెడ్డి తదితరులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి టికెట్ విషయంలో పార్టీ అధిష్టానం పునరాలోచించాలన్నారు. బీజేపీ అభ్యర్థిగా మురళీయాదవ్ ఎన్నికల బరిలో ఉంటే తాము మద్దతు ఇవ్వబోమని ఖరాఖండీగా తేల్చి చెప్పేశారు. ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తూ పార్టీని పటిష్టం చేసినవారికి కాకుండా నిన్న, మొన్న పార్టీలో చేరిన మురళీయాదవ్‌కు టికెట్ ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు సరిగ్గా తెలియని, పార్టీలు మారుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించడం ఎంత వరకు సమంజసమని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను ప్రశ్నించారు. మురళీయాదవ్‌కు టికెట్ ఇవ్వడం ఈటలకు తగదని సూచించారు. ప్రజల్లో మంచి అభిప్రాయం లేని వ్యక్తికి టికెట్‌ను కేటాయించి ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం ఈటెల రాజేందర్‌కు చెల్లదని వెల్లడించారు. ఇప్పటికైనా పార్టీ శ్రేణులతో చర్చించి, అభ్యర్థిని మార్చాలని కోరారు. సమావేశంలో వివిధ మండలాలకు చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.